



రమణ రావడం అంతదూరంనుంచే చూసిన జయ మనసు ఆనందంతో ఊగిపోయింది. చాలా రోజులయిపోయిందతన్ని చూసి. ఏడెనిమిది నెల లయిపోయింది కాబోలు! తనిప్పుడు గుర్తిస్తాడో, లేదో! తనిప్పుడు ఆదివరలా లంగా జాకెట్టు కాక, ఓణీలు వేస్తోంది. అప్పుడప్పుడు చీరలుకూడా కడుతోంది. ఎంచేతో, అతనంటే ఇష్టం తనకి! ఈ ఏడెనిమిది నెలల్లోనూ, అనేకసార్లు గుర్తుకొచ్చాడతను. చిన్నప్పటినుంచీ అన్ని రోజులు అతన్ని చూడకుండా ఎప్పుడూ ఉండలేదు. అసలతను ఈ ఊరు వదిలే సంవత్సరం దాటుతోంది. అంతకు

ముందెన్నడూ తనుగాని, అతనుగానీ ఒకటి రెండురోజులు కంటె ఎక్కువ ఆ ఊరు వదలి ఉండనేలేదు. వెళ్ళిన కొత్తలో నెల నెలా వచ్చి వెళ్తూండే వాడు. రావడం సరాసరి తనదగ్గరకే వచ్చి ఆప్యాయంగా బుగ్గలు పిండేసే వాడు. వీపుమీద ప్రేమతో చరిచేవాడు. నెత్తిమీద మొట్టేవాడు. మరి...మరి... ఇప్పుడు కూడా అలానే చేస్తాడా? ఏమో! ఛీ! అయినా తనిప్పుడు అదివరలా కాదుగా! భారతి అక్కయ్యలా చీరెలు కట్టేస్తోంది. పిలకజడ మానేసి రెండు జడలేస్తోంది. అక్కయ్య వాడే స్నో, పౌడరూ! కాటుకా, తిలకం అన్నీ-తనూ వాడుతోంది.

''ఏం రమణా! బావున్నావా? ఈ మధ్యన వచ్చి చాలా రోజులయిపోయి నట్టుందే!...'' అమ్మ వాకిట్లో నుంచుని రమణని పలకరించింది.

"ఏదీ, సెలవు దొరకలేదు..." నవ్వుతూ చెప్పాడు రమణ.

"ఏరా, రమణా! ఇదేనా రావడం?" నాన్నకూడా అప్పుడే పొలంనుంచి వస్తూ అడిగారు.

''ఇప్పుడే బస్ దిగాను...'' లోపలికి చూస్తూ అన్నాడు రమణ. బహుశా తన కోసమే వెతుకుతూండి ఉంటాడు.

"ఎలావుంది ఉద్యోగం? మనూరికి దగ్గర్లో బదిలీ చేయించుకోకూడదూ?" "ఇంకోసంవత్సరం అయితేగాని లాభంలేదండీ!" నవ్వుతూ అన్నాడతను.

అలా నవ్వినప్పుడే చాలా బావుంటాడు తనకి.

''చిట్టేదీ!'' అమ్మనడిగాడు.

"అవున్లే! దాన్ని చూడకపోతే ఉండ గలవా—ఏమేవ్! రమణ మావయ్యొ చ్చాడు...'' గట్టిగా అరచింది అమ్మ.

ఇవాళ తనకెందుకో, అదివరలా పరుగెత్తుకొంటూ అతనిదగ్గర కెళ్ళాలని పించటంలేదు. సిగ్గుగా, కొత్తగా ఉంది.

"లోపల ఉంది వెళ్ళు రమణా!" అమ్మ అంటోంది.

అతనిక లోపలికొచ్చేస్తాడు. జయ కిటికీ దగ్గరనుంచి తప్పుకొని, హడా వుడిగా అల్మారాలో ఏవో పుస్తకాలు కెలుకుతున్నట్టు నటించసాగింది. రమణ. లోపలికి రానేవచ్చాడు. అతన్ని చూసి, వెంటనే సిగ్గుతో తల దించేసుకొంది. తను కట్టుకొన్న అక్కయ్యచీర ఎంతో భారంగా, కొత్తగా ఉన్నట్లనిపించ సాగింది.

బుగ్గలు పిండేస్తున్నాడతను.

"ఏమిటిక్కడ దాక్కొన్నావ్?"

అతని చేతులు, అప్రయత్నంగా తీసి వేసి దూరంగా జరిగిసిది జయ. అతని చేతి స్పర్శ ఎప్పుడూలేని జలదరింపు కలుగజేసింది.

"ఇదిగో! చాక్‌లెట్ బాక్స్! ఇదివర కొచ్చినప్పుడు, 'కీ' ఇస్తే డాన్స్ చేసే

బొమ్మ కావాలన్నావుగా! తెచ్చాను చూడు!..." తనవంక చూడకుండానే అట్టపెట్టెలోనుంచి ఓ బొమ్మతీసి 'కీ' ఇచ్చి టేబుల్ మీదుంచాడు. అది ఊగుతూ, తిరుగుతూ డాన్స్ చేస్తోంది.

"చూశావా, ఎంత బావుందో!..." బొమ్మవంకే సంతృప్తిగా చూస్తూ అన్నాడతను, కాని జయ దృష్టి బొమ్మ మీద లేదు. అతని ముఖంవంకే చూస్తోంది. తనలోని మార్పుని గమనించకుండా, ఓ "డాన్సింగ్ బొమ్మని గురించి మాట్లాడటం ఆమెకు కోపం కలిగించింది.

"ఏమిటీ మనిషి? తననింకా అదివరలాగానే చిన్నపిల్లలా చూస్తున్నాడు. తనింకా బొమ్మలతో ఆడుకోటమేమిటి? ఏది బొమ్మలతో ఆడుకొనే వయసో ఆ మాత్రం గుర్తించలేదేమిటి? పైగా 'చిట్టీ' అనే పిలుస్తున్నాడింకా నన్ను. చిట్టి, పొట్టీనూ! తననింకా చిన్న పాపాయి అనుకుంటున్నాడల్లే ఉంది. 'జయా' అని పిలువలేడూ? తనక్కడికి, తనకంటె మహా పెద్దాడయిపోయినట్లు! తనకంటె ఏడెనిమిదేళ్ళు పెద్దాడేమో! అంత మాత్రానికే, ఎప్పటికీ తననో పసిదానిలా చూడాలా? తనింకా, అతగాడు రాగానే తన రూపంచూసి ఆశ్చర్యపోతాడనీ, చీరలో తన అందంచూసి విస్తుపోతాడనీ, ఊహించింది. "అరె! చాలా పెద్దదానివయిపోయావ్" అంటాడేమోనని ఆశపడింది. పక్కింటి రాధమ్మత్తతో వేయించుకొన్న రెండు జడలుచూసి ముచ్చటపడతాడనుకొంది. పెరట్లో విరిసిన ఒకే ఒక్క గులాబీని తన జడలో చూసి మురిసిపోతాడనుకొంది.

"హాయ్! హాయ్! చూశావా! ఎలా వుంది?"

బొమ్మ నాట్యంచేయడం ఆపేసింది.

"నాకేం బావుండలేదు!" కోపంగా అంది జయ.

రమణ కొంచెంగా షాక్ తిన్నట్లయాడు. అంతకు ముందెవ్వడూ చిట్టి అలా అనలేదు. అలాంటి బొమ్మ కావాలని మారాంచేసి,-తీరా తెచ్చాక రమణకేమీ అర్థంకావటంలేదు. చిట్టి మారిపోయినట్లు అనుమానం వచ్చిందతనికి. చిట్టి సంగతి తనకు బాగా తెలుసు. సంవత్సరం క్రితం ఆ ఊరు వదలి, ఉద్యోగాని కెళ్ళేవరకూ ఎప్పుడూ తన వెనుకే తిరుగుతుండేది. ఒక్క క్షణంకూడా తనని వదలి ఉండేదికాదు. ఎప్పుడూ ఏదొక కబుర్లు చెపుతూండేది. తనని కథలు చెప్పమని వేదించుకు తింటూండేది. రాజుకొమారుల కథలూ-అందులో రాక్షసులూ—ఎంత ఆనందంగా వినేదా కథలన్నీ? అసలు వాళ్ళింటిదగ్గర ఒక్క నిముషంకూడా ఉండేదికాదు ఎప్పుడూ తమ ఇంట్లోనే! ఇప్పుడు-పాపం, అది గిందికదాని, తను ఎంతో సంబరంతో ఈ బొమ్మ తీసుకొస్తే సంతోషించక

పోగా-అసలా విషయమే మాట్లాడదాయె! పైగా బాగోలేదట! చిట్టివంక ఉక్రోషంతో చూశాడు రమణ. అంతవరకూ అతని ముఖంలోకి చూస్తూన్న చిట్టి చటుక్కున తల వంచేసుకొంది. చిన్నగా తనలో తను నవ్వుకుంటోంది. ఇది మరీ కొత్తగా కనిపించింది రమణకి! ఎప్పుడూ ఘొల్లున నవ్వుతూ అల్లరి చేస్తూండేది. ఇప్పుడే మోవచ్చీరాని-నవ్వు—అదీ చాలా చిన్నగా నవ్వుతోంది—రమణకి కోపమొచ్చింది.

"సరే! నేను వెళ్తున్నాను చిట్టీ..." అన్నాడు అసహనంగా.

జయ మాట్లాడలేదు. నవ్వుకొంటూనే చీరకొంగుని చేత్తో వేలికి చుట్టుకొంటోంది. రమణకి కోపం పెరిగింది.

"నేను వెళ్తున్నాను..." అన్నాడు గట్టిగా!

జయ మళ్ళీ నవ్వింది.

రమణకి ఆవేశం కట్టలు తెంచుకొంది.

ఛట్టుక్కున ఆమె రెండు బుగ్గలూ పట్టుకొని పిండుతూ "నీకు, బాగా పొగ రెక్కిపోయింది!" అన్నాడు కసిగా.

అతని చేతులు వదిలించుకొని "ఛీ! పో!" అంటూ నాలుక బయటకుపెట్టి వెక్కిరించి అక్కడినుంచీ పరుగుతో వెళ్ళిపోయింది జయ.

నిర్ఘాంతపోయి నెమ్మదిగా బయటకు నడిచాడు రమణ. అతని మనసంతా ఆలోచనలతో నిండిపోయింది.

చిట్టి ఎందుకిలా మారిపోయింది? తన నసలు లెఖ్ఖచేయడవేలేదు!

ఆ సాయింత్రం చిట్టి తనింటికొస్తుందేమోనని ఎదురు చూశాడు రమణ. కాని ఆమె చుట్టుపక్కల ఆడపిల్లల్తో కలసి ఆడుకొంటూ కనిపించింది. రాత్రికి వెన్నెల్లో బయట మంచం వేసుకొని చందమామ వంకేచూస్తూ పడుకొన్నాడు రమణ.

అదివరకయితే ఈపాటికి చిట్టి తన దగ్గర కూర్చుని కథలు చెప్పించుకొంటూండేది. కేవలం చిట్టికోసమే ప్రతి నెలా సెలవుపెట్టి వస్తూండేవాడు తను! ఆమెను నెలకోసారయినా చూడాలనిపించేది! ఈసారి సెలవు దొరక్కపోవడం మూలాన రావడం ఆలస్యమయింది. ఈలోగా చిట్టి ఇంతగా మారిపోయింది. చిట్టి తనతో గడపకపోతే—కబుర్లు చెప్పకపోతే_అల్లరిచేయకపోతే_ తనకేం ప్రొద్దు పోతుందీ ఊళ్లో!

హఠాత్తుగా ముఖంమీద ఏదో మెత్తగా పడినట్లయి ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు రమణ. మల్లెల వాసన గుప్పుమంది. పక్కంతా మల్లెపూలమయం. డాబామీదనుంచి కిలకిల నవ్వు వినిపించింది. ఛటుక్కున తలపైకెత్తి చూశాడు రమణ.

చిట్టి పిట్టగోడనానుకొని బొమ్మలా నుంచుంది.



"ఏయ్ చిట్టీ? ఎవరీ పూలుపడేసింది?" కోపంగా అన్నాడతను.

"నేనే–దండ కడుతోంటే జారిపోయినయ్!..."

ఆ రాత్రంతా చిట్టి తనకు దూరం అయిపోయిందన్న ఆలోచనలతో నిద్ర పట్టనేలేదు.

ఉదయమే లేచి బాగ్‌లో బట్టలు సర్దుకొంటూంటే, గుమ్మంలో అలికిడయి వెనక్కు తిరిగిచూశాడు. చిట్టి లోపలకు వస్తూ కనిపించింది రమణకు. సంతోషంగా ఆమెవంక చూశాడు.

చిట్టి అదివరలా–తనతో సరదాగా మాట్లాడాని కొచ్చిందా? జయ రమణని చూసి సిగ్గు నభినయించింది. పొడుగాటి మల్లెపూల జడ వేసుకొందామె.

"చిట్టీ!" ఆనందంగా అన్నాడు రమణ.

"నిన్న మీ ఇంటికొస్తే మాట్లాడలేదుగా! ఇప్పుడెందుకొచ్చావ్!"

చాలా ఆశాభంగం కలిగించింది జయకు! తనను చూడగానే "నువ్ చాలా అందంగా ఉన్నావ్! చీర–జడా చాలా బాగున్నాయ్" అంటాడేమో అనుకొంది.

"ఏం మాట్లాడాలీ–ఇంట్లో!" అంది నెమ్మదిగా.

"మరి అదివరకేం మాట్లాడేదానివీ?"

"అప్పుడేమో చిన్నపిల్లని-"

"ఇప్పుడేం - మహా పేద్దదానివయిపోయినావా?"

జయ ఛటుక్కున తలెత్తి అతని వంక చూసింది. ఇంత స్పష్టంగా చెప్తోన్నా అతని కర్థంకావడంలేదా!

"అసలు నీకు బాగా పొగరెక్కిందిలే! నేను కనిపెడుతూనే ఉన్నాగా! రాత్రికూడా డాబామీద నుంచుని నామీద పూలు పడేశావ్?" ఇంకా కోపంగానే అన్నాడు రమణ. చిట్టికి ఏం మాట్లాడాలో తెలీటంలేదు. వయసులో ఉన్న ఆడపిల్ల ఓ మగాడిమీద పూలెందుకు విసుర్తుంది? ఆమాత్రం తెలుసుకోలేడూ? తన ఖర్మ!

"ఇంతకూ ఇప్పుడెందుకొచ్చినట్లు? ఇంకాసేపట్లో నేను ఊరు వెళ్తోంటే?"

"నీకోసమేం రాలేదు! అత్తయ్యకోసం వచ్చాను..." అనేసి అక్కడి నుంచి చరచర నడిచి బయటికి వెళ్ళిపోయింది.

మరికాసేపటి తర్వాత చిట్టితో చెప్పకుండానే పట్నం వెళ్ళిపోయాడు. ఆరు నెలలవరకూ మళ్ళీ తిరిగి రానేలేదు. అప్పుడయినా వెళ్ళదలచుకోలేదు గానీ- తలిదండ్రులు పెళ్ళి నిశ్చయంచేసి, కబురు చేయడంమూలాన తప్పలేదు. ఈ ఆరు నెలలూ జయ అతనికోసం ఎదురు చూడని రోజులేదు. అతనికి కరణంగారమ్మాయితో వివాహం నిశ్చయమైందని, త్వరలో పెళ్ళి జరగబోతుందనీ తెలిసినప్పుడు ఆమె హృదయం తల్లడిల్లిపోయింది. పెళ్ళి రెండ్రోజులుందనగా శుభలేఖ తీసుకొని తనదగ్గర కొచ్చిన రమణని చూసి ఆమె కన్నీళ్లు ఆగలేదు.

"మావయ్యా! ఇప్పటికీ నేను నువ్ చిన్నప్పుడు చూసిన చిట్టినేనా? ఇంకా నన్ను ఓ 'స్త్రీ' గా గుర్తించలేదా? నాతో పాటు ఎదిగి, నిన్నే నింపుకొన్న నా మనసుని గ్రహించలేదా? నా ఆశలిలా మోడువారిపోవాల్సిందేనా?'' అని అరగాలనిపించింది గానీ నిస్సహాయంగా అతనివంక చూస్తూ ఊరుకుండిపోయింది. పెళ్ళిపీటలమీదనుంచి దూరంగా పందిరి గుంజనానుకొని తనవంకే చూస్తోన్న జయనుచూసి బాధపడ్డాడు రమణ "చిట్టి ఎందుకిలా మారిపోయింది?"

